క్లుప్తంగా

ద్వారకానగర్‌లో తొలగిన తాగునీటి కష్టాలు



మంచినీటి కుళాయిను ప్రారంభిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

చోడవరం: పట్టణంలోని ద్వారకానగర్ కాలనీ వాసులకు ఎట్టకేలకు తాగునీటి కష్టాలు తీరాయి. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చొరవతో ద్వారకానగర్ కాలనీలో పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, వార్డు మెంబర్లు కందర్ప మాధురీశంకర్, ఓరుగంటి నెహ్రూ, ముగ్రోతు చిన్న వీటిని శనివారం ప్రారంభించారు. ఇక్కడ 200 గృహాలకు పూర్తిస్థాయిలో కుళాయిలు లేక మంచినీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిలో మంచినీటి కుళాయిలు వేయడంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు.

డప్పు, చర్మకారుల గుర్తింపునకు సర్వే



బుచ్చింపేటలో డప్పు, చర్మకారుల వివరాలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారుల బృందం

రోలుగుంట: డప్పు, చర్మకారులకు త్వరలో డిజిటల్ గుర్తింపుకార్డులు ఇచ్చేందుకుగాను జిల్లా సోషల్ వెల్ఫేర్ ప్రత్యేకాధికారుల బృందం శ్రీనివాసరావు, శివ, బాబూరావు, షేక్ కాలేషాబాబు సర్వే చేపట్టారు. దీనిలో భాగంగా శుక్ర, శనివారాలు మండలంలోని వడ్డిప, రోలుగుంట, బుచ్చింపేట, జానకీరాంపురం, కుసుర్లపూడి గ్రామాల్లో డప్పు, చర్మకారులకు సంబంధించి పింఛన్‌దారులను నేరుగా కలుసుకున్నారు. వారి వివరాలు, అర్హతలను నమోదు చేసుకున్నారు. ఇప్పటి వరకూ 99 మంది పింఛన్‌దారుల నుంచి వివరాలు సేకరించామని, ప్రభుత్వానికి నివేదిస్తామని ఈ సందర్భంగా ప్రత్యేకాధికారులు తెలిపారు.

సమాజాభివృద్ధికి స్వచ్ఛంద సేవలు కీలకం



మాట్లాడుతున్న విశ్రాంత డీఎఫ్‌వో జీవన్‌రాయ్

నాతవరం: సమాజాభివృద్ధి చెందాలంటే ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థల సేవలు చాలా కీలకమని విశ్రాంత డీఎఫ్‌వో జీవన్‌రాయ్ తెలిపారు. అమ్మ వాసవీ సేవా సంఘం మండలాధ్యక్షురాలు ఇట్టంశెట్టి అక్కయ్యమ్మ ఆధ్వర్యంలో శనివారం నాతవరంలో వృద్ధులకు దుస్తులు, పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో అమ్మ వాసవీ సేవా సంఘం ఎనలేని సేవలందించిందని ప్రశంసించారు. కార్యక్రమంలో అమ్మ వాసవీ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు పేరూరి బుల్లిదొర, సంస్థ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేటలో పూడిక తొలగింపు



ఊర కాలువలో పూడిక తీస్తున్న జేసీబీ

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేటలోని ఊర కాలువలో పూడికలను తొలగించారు. పది రోజుల క్రితం ఇక్కడ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో ఊర కాలువ నుంచి దుర్గంధం వెలువడి దోమలు బెడద ఉందని పూడికలు తొలగించాలని గ్రామస్తులు కోరారు. ఆయన ఆదేశాల మేరకు పాలకవర్గ సభ్యులు శనివారం సాయంత్రం జేసీబీతో పూడిక తీసి ట్రాక్టర్ల ద్వారా గ్రామానికి దూరంగా తరలించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

341 మంది రైతులకు రూ.7.60 లక్షల డివిడెండ్

- చోడవరం సొసైటీ అభివృద్ధికి కృషి: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



చోడవరం సొసైటీలో రైతులకు డివిడెండ్ పంపిణీలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: పంట మార్పిడి, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి, వారి అభివృద్ధికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కృషి చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశించారు. శనివారం స్థానిక పీఏసీఎస్‌లో నిర్వహించిన డెవిడెంట్లు పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా 341 మంది సంఘ సభ్యరైతులకు 10 శాతం చొప్పున డివిడెండ్లు పంపిణీ చేశారు. సంఘంలో రైతులకు చెందిన షేర్ క్యాపిటల్ రూ. 76.60 లక్షలు ఉండగా, ఈ మొత్తంపై రూ.7.60 లక్షల డివిడెండ్‌ను పంపిణీ చేశామని ఆయన తెలిపారు. రైతుల పెట్టుబడులకు కావాల్సిన వ్యవసాయ రుణాలు సకాలంలో సొసైటీలు ఇవ్వాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, నేరుగా కల్లాల వద్దకు వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేసేలా సొసైటీ అధికారులు, పాలకవర్గం చర్యలు తీసుకోవాలన్నారు. పంటల మార్పిడిపై రైతులకు అవగాహన పెంచి కొత్త రకాలు, ప్రత్యామ్నాయ, అంతర్ పంటలపై చైతన్య సదస్సులు నిర్వహించాలన్నారు. చోడవరం సొసైటీ అభివృద్ధికి తాను కృషి చేస్తానన్నారు. ప్రస్తుత భవనం స్థానంలో అందనంగా కొత్త భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కేంద్ర సహకారం బ్యాంక్ సహకారంతో స్థానిక పీఏసీఎస్‌లు మరింతగా రైతులకు సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, డీసీసీబీ డైరెక్టర్ మూడెడ్ల మహాలక్ష్మి శంకరరావు, సొసైటీ అధ్యక్షుడు దన్నిన వెంకట్రావు, డైరెక్టర్లు గుమ్ముడు శ్రీనివాసరావు, గూనూరు రామకృష్ణ, కార్యదర్శి సింహాచలం, లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షుడు శానాపతి సత్యారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏ ఒక్కరికీ పింఛన్ తొలగించలేదు

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్, చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి

నర్సీపట్నం: అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి సచివాలయంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మితో కలిసి ఆయన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్నెల్లకొకసారి తనిఖీల్లో భాగంగా అనివార్య కారణాల వల్ల 480 మందికి పింఛన్లు నిలిచిపోయాయన్నారు. రీవెరిఫికేషన్‌లో ఎలాంటి లోపాలు లేకపోవటం వల్ల వాటిని యథావిధిగా కొనసాగిస్తున్నామన్నారు. దీనిపై టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమన్నారు. ఇటువంటి తప్పుడు ఆరోపణలను ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, పార్టీ పట్టణాధ్యక్షుడు ఏకా శివ, కమిషనర్ కనకారావు, కౌన్సిలర్లు బోడపాటి సుబ్బలక్ష్మి, బేతిరెడ్డి రత్నం, సిరసపల్లి నాని, మాకిరెడ్డి బుల్లిదొర, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషా బేగం, అర్జున్‌వెంకట్రావు, కోఆప్షన్ సభ్యులు ఎం.డి. బాషా, షేక్ రోజా, పార్టీ నాయకులు గుడబండి నాగేశ్వరరావు, గవిరెడ్డి స్వామినాయుడు, మామిడి శ్రీను, చిటికెల కన్నబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి

- గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్




మహిళలు చెప్పే సమస్య వింటున్న ఎమ్మెల్యే గణేష్

నాతవరం: రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కోరారు. నాతవరం గ్రామ సచివాలయం –1లో శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగారు. తన దృష్టికి వచ్చిన ఇళ్లు, డ్రైనేజీలు, వీధిరోడ్లు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సంక్షేమ పథకాలు అందడంతో టీడీపీ సానుభూతిపరులు, తన కుటుంబానికి రూ.3.85 లక్షల లబ్ధి కలగడంతో పైల దేవి ఎమ్మెల్యేకు, సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 40 లక్షలతో నాతవరం పంచాయతీని అభివృద్ధి చేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు దృష్టి సారించామన్నారు. తహసీల్దార్ కనకారావు, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, సర్పంచ్ గోలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీ చెక్కా ప్రభావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయలక్ష్మి, గన్నవరం, పి.కె.గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు గొర్లె వరహాలబాబు, అచ్చేర్ల వరహాలబాబు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, పాల్గొన్నారు.

బోరు హెడ్ తొలగించారని నిరసన దీక్ష

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట మంచినీటి బోరు హెడ్ వెంటనే బిగించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు శనివారం సాయంత్రం రిలే నిరాహార దీక్షకు దిగారు. ఆయనకు మద్దతుగా స్థానికులు దీక్షలో కూర్చొన్నారు. బోరు హెడ్‌ను రాపేట రామకొండలరావు తొలగించారని ఆరోపించారు. సమస్య పరిష్కరించే వరకు దీక్ష కొనసాగిస్తామని తేల్చిచెప్పారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



రోలుగుంట: జానకీరాంపురంలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు



మాకవరపాలెం: రామన్నపాలెం కాలనీలో పనులు చేస్తున్న సిబ్బంది

మాడుగుల: హౌసింగ్ డే సందర్భంగా మండలంలో అవురువాడ, కింతలి వల్లాపురం గ్రామాల్లోని జగనన్న లేఅవుట్‌లను ఎంపీడీవో మీనాకుమారి, తహసీల్దారు పి.వి.రత్నం, గృహ నిర్మాణ శాఖ ఏఈ లెక్కల సత్యనారాయణ, శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కాలనీలో వీధిరోడ్ల లైటింగ్ ఏర్పాటు కానుందన్నారు.

రోలుగుంట: మండలంలోని జానకీరాంపురం, కుసుర్లపూడి గ్రామాల్లో జగనన్న కాలనీలను మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావు ఎంపీడీవో ప్రభాకరావు, హౌసింగ్ ఏఈ ప్రసాదరావు శనివారం సందర్శించారు. గృహ నిర్మాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సూర్యకుమారి, వెలుగు ఏపీఎం సాధన పాల్గొన్నారు.

ముమ్మరంగా విద్యుత్ లైన్ పనులు

మాకవరపాలెం: జగనన్న కాలనీల్లో ఈ నెలాఖరుకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ముమ్మర చర్యలు చేపట్టారు. మండలంలో 31 లేఅవుట్లలో 1,068 మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. ఇప్పటికే లబ్ధిదారులు శరవేగంగా నిర్మాణాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రామన్నపాలెం లేఅవుట్‌లో విద్యుత్ లైన్ పనులు చేపట్టారు.

సీఎం, ఎమ్మెల్యే జోలికి వస్తే సహించేదిలేదు



మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షుడు పైల పోతురాజు, ఎంపీటీసీ పుష్ప

నాతవరం: టీడీపీ నాయకులు గ్రామాల్లో తిరుగుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌పై విమర్శలు చేస్తే సహించేదని లేదని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, ఎంపీటీసీ ఐనవసప్పల పుష్ప హెచ్చరించారు. శనివారం నాతవరంలో ఎంపీపీ లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ అప్పలనర్సలతో కలిసి వారు మాట్లాడారు. మూడు రోజులుగా మాజీ మంత్రి అయ్యన్నతో తిరుగుతూ ప్రభుత్వంపై తీవ్ర పదజాలంతో దూషిస్తున్నారన్నారు. డి. యర్రవరం సర్పంచ్ ఇ.సత్యవతి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎల్. అచ్చిరాజు, మాజీ జెడ్పీటీసీ కె. సత్యనారాయణ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

బాల్య వివాహాలు, రక్తహీనతపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రావికమతం: అంగన్‌వాడీ కేంద్రంలోని పౌష్టికాహారాన్ని కిశోర బాలికలు, గర్భిణులు క్రమం తప్పకుండా తీసుకుంటే రక్తహీనత దరిచేరదని గర్నికం గ్రామాఖ్య సంఘం అధ్యక్షురాలు ఆర్లె వెంకటలక్ష్మి తెలిపారు. శనివారం గర్నికంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత రక్తహీనత, బాల్యవివాహాలు, గృహ హింస చట్టం, దిశ యాప్ గూర్చి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

గొలుగొండ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా చర్యలు తీసుకుంటుందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసులనాయుడు తెలిపారు. అమ్మపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ గతంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని కలిసి ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించామన్నారు. సీపీఎస్‌తోపాటు ఇతర సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులపై చర్చించినట్లు తెలిపారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్, యూనియన్ నాయకులు కురుచ రమణ, బాలకృష్ణ, రవిశంకర్, లోవ రమేష్ పాల్గొన్నారు.

దాహార్తి తీర్చాలంటూ మహిళల నిరసన

నర్సీపట్నం: తమ దాహార్తి తీర్చాలంటూ చెట్టుపల్లికి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో శనివారం నర్సీపట్నం – చోడవరం ప్రధాన రోడ్డుపై నిరసన చేపట్టారు. నెలరోజుల నుంచి తాగునీటికి ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. స్పందనలో కలెక్టర్, నర్సీపట్నం ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లామని పరిష్కరించలేదని కుపరాల రాంతల్లి, దారాలమ్మ, లక్ష్మి, రమణమ్మ, దేవమ్మ, అచ్చియ్యమ్మ వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీషా అక్కడకు చేరుకుని సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పాన్‌షాపులో చోరీ



బాధిత దివ్యాంగుడిని పరామర్శిస్తున్న సర్పంచ్

బుచ్చెయ్యపేట: రాజాం గ్రామానికి చెందిన దివ్యాంగుడు జెర్రిపోతుల తాతరాజుకు చెందిన పాన్‌షాపులో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బతుకు దెరువు కోసం గ్రామంలో పాన్‌షాపు పెట్టి జీవనోపాధి పొందుతున్నాడు. శుక్రవారం రాత్రి షాపు మూసి ఇంటికెళ్లిపోయాడు. శనివారం ఉదయం వచ్చి చూడగా, షాపు తాళాలు పగలగొట్టి ఉండటంతో పోలీసులు ఫిర్యాదు చేశారు. షాపులో రూ.7వేలతోపాటు సామగ్రి ఎత్తుకుపోయారని బోరుమన్నాడు. గ్రామ సర్పంచ్ అతడిని పరామర్శించి రూ.2 వేల సాయం చేశాడు.


వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు

మాకవరపాలెం: ఒక వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. వివరాలివి. మండలంలోని భీబోయిన పాలెం గ్రామానికి చెందిన రెడ్డి సన్యాసిదేముడు(40) స్వగ్రామంలోని మరిడమ్మ ఆలయం సమీపంలో బల్లపై శుక్రవారం సాయంత్రం కూర్చుండగా పాత కక్షల నేపథ్యంలో ఇదే గ్రామస్థులైన ఎద్దు రాజుబాబు, మణిబాబు, లోవరాజు దాడి చేశారు. దుర్భాషలాడడమేగాక రాళ్లతో కొట్టి గాయపరిచారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన ముగ్గురిపై శనివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. సన్యాసిదేముడు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు.

చినపాచిల వీఆర్వోకు గాయాలు

రావికమతం: చినపాచిల వీఆర్వో బూరపు సత్తిబాబుకు రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. సొంత పనిపై అనకాపల్లి వెళ్లి వస్తుండగా బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట వద్ద ఆగి ఉన్న అతడి బైక్‌ను చోడవరం నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన అతడిని అనకాపల్లి వైద్యాలయానికి తరలించారు.

పీఆర్ మినిస్టీరియల్ సంఘం అధ్యక్షుడిగా కామేశ్వరరావు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గం

చోడవరం రూరల్: ఏపీ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం చోడవరం తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా ఎల్.కామేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చోడవరం, వి.మాడుగుల, చీడికాడ మండలాల నుంచి మండల పరిషత్ కార్యాలయాలు, ఇంజినీరింగ్ సబ్ డివిజన్ కార్యాలయాలు, జెడ్పీ ఉన్నత పాఠశాలల సిబ్బంది శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమై చోడవరం తాలూకా యూనిట్‌ను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సిహెచ్.సింహాచలం, వైస్ ప్రెసిడెంట్‌గా వి.రామారావు, కోశాధికారిగా బి.పుష్పలత, జాయింట్ సెక్రటరీగా ఏ.బాలాజీరావు, కౌన్సిల్ సభ్యులుగా డి.కొండలరావు, కె.శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరందరితో ఎన్నికల అధికారి జి.గంగాధర్ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు అభినందించారు. సంఘం బలోపేతానికి కృషి చేయాలని సంఘం జిలా గౌరవాధ్యక్షుడు కూర్మారావు సూచించారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన

- గడప గడపకు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ప్రజలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. చౌడువాడ-2 సచివాలయం పరిధిలోని మల్లంపాలెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లంపాలెం–చౌడువాడ గ్రామాల మధ్య చిట్టిగెడ్డ వంతెన నిర్మాణానికి రూ.2.40 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో తనకు మూడేళ్ల జగనన్న పాలనలో పలు సంక్షేమ పథకాల ద్వారా రూ.2.5 లక్షల లబ్ధి పొందినట్లు జాగరపు అప్పారావు ఆనందం వ్యక్తం చేశాడు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్యనారాయణ, ఎంపీడీవో శచీదేవి, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొంప్రుపోటు వెంకటరావు, వార్డు మెంబర్లు వంటాకు గోవిందరావు, వంటాకు రామునాయుడు, డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, ఆకుల సాయిప్రసాద్, రాజి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ రాజి మోదినాయుడు పాల్గొన్నారు.

నేడు పాచిలవానిపాలెంలో..

పాచిలవానిపాలెంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శచీదేవి తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారన్నారు.

నిర్వాసిత కాలనీలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మాకవరపాలెం: ప్రభుత్వ భూమిని ఆక్రమంచి ఏర్పాటు చేసిన దుకాణాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. తామరం రెవెన్యూ పరిధి కొత్తపాలెం నిర్వాసిత కాలనీకి ఆనుకున్న భూమిలో కొందరు అన్‌రాక్ నిర్వాసితులు ఇటీవల దుకాణాలు ఏర్పాటు చేశారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ప్రసాదరావు రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి శనివారం అక్కడకు జేసీబీతో వెళ్లారు. ఈ క్రమంలో దుకాణదారులు జేసీబీని అడ్డుకుని అధికారులతో వాగ్వాదానికి దిగారు. భూములు కోల్పోవడంతో ఉపాధి కోసం దుకాణాలు పెట్టుకున్నామని, వీటిని తొలగిస్తే జీవనం కోల్పోతామని వాపోయారు. అయినప్పటికీ రెవెన్యూ సిబ్బంది ఆక్రమణలు తొలగించే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇక్కడ ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దారు శంకర్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- గడప గడపకు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



పిల్లవానిపాలెంలో ప్రజల సమస్యలు వింటున్న ధర్మశ్రీ

రావికమతం: చోడవరం నియోజకవర్గంలో ప్రతి సమస్యను పరిష్కరించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పిల్లవానిపాలెం గ్రామంలో శనివారం ఆయన ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఎవ్వరైనా లంచాలు అడుగుతున్నారా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. పలువురు మహిళల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి తమ గ్రామానికి వచ్చే రోడ్డును అభివృద్ధి చేయాలని కోరగా, నిధులు మంజూరయ్యాయని, టెండర్ పూర్తయ్యిందని పండుగ తర్వాత పనులు ప్రారంభిస్తామని ధర్మశ్రీ చెప్పారు. సర్పంచ్ గుమ్మాల శంకర్రావు, ఎంపీటీసీ కరణం అప్పారావు అభ్యర్థన మేరకు పిల్లవానిపాలెంతోపాటు గుడివాడ గ్రామాల్లో సీసీ డ్రైనేజీల నిర్మాణానికి రూ.10 లక్షలు, కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.3 లక్షలు, కళ్యాణ మండపం నిర్మాణానికి రూ.8 లక్షలు మంజూరు చేశారు. ఎంపీపీ పైల రాజు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, భవానీప్రసాద్, మండల మాజీ అధ్యక్షుడు జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, మాజీ జెడ్పీటీసీ ఆశరి వాసుగోవిందరావు, చోడవరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు, నాయకులు రాము, ఈశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, తహసీల్దార్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత



కళ్యాణానికి పింఛను అందిస్తున్న వలంటీరు నాయుడు

రావికమతం: విశాఖపట్నంలో చికిత్స పొందుతున్న లబ్ధిదారు గేడి కళ్యాణానికి మేడివాడ గ్రామ వలంటీర్ గంటా నాయుడు శనివారం పింఛను అందించారు. తన పరిధిలో పింఛన్‌దారులందరికీ ఈనెల 1వ తేదీనే పింఛన్లు పంపిణీ చేశారు. అయితే గ్రామానికి చెందిన కళ్యాణం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలుసుకుని అక్కడికి వెళ్లి పింఛను అందించి మానవత్వం చాటుకున్నాడు.

త్వరితగతిన భూసర్వే పూర్తి

రోలుగుంట: భూసర్వే త్వరితగతిన పూర్తి చేయాలని వీఆర్వోలకు తహసీల్దార్ కె.వెంకటేశ్వరావు ఆదేశించారు. శనివారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన వీఆర్వోలతో సమీక్షించారు. రెవెన్యూల వారీగా సర్వే ఏ మేరకు పూర్తయిందో చర్చించారు. నిబంధనలు పాటిస్తూ సరళమైన పద్ధతిలో భవిష్యత్‌లో భూ సమస్యలకు తావులేకుండా రికార్డులు తయారు చేయాలని ఆదేశించారు. ఆర్. నరేంద్ర, సర్వేయర్ తవిటినాయుడు పాల్గొన్నారు.

చేతిపంపు పనులకు భూమిపూజ



బోరు తవ్వకానికి భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ

చీడికాడ: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో తురువోలు గ్రామానికి సమీపంలో జూరెడ్డి వాని చెరువు వద్ద జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం శనివారం భూమిపూజ చేసి తాగునీటి చేతిపంపు తవ్వకం పనులు ప్రారంభించారు. ఇక్కడ పరిసరాల్లో పొలం పనులు చేసే రైతులు, పశువుల కాపరులు తాగునీటి కోసం రెండు కిలోమీటర్ల మేర వెళ్లాల్సి వచ్చేది. ఎట్టకేలకు సమస్య పరిష్కారం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు చొక్కాకుల వెంకునాయుడు, బొడ్డు అప్పలనాయుడు, కోటి పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్లలో అధికారుల తనిఖీలు

రావికమతం: మండలంలోని రావికమతం, తోటకూరపాలెం గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రవికుమార్, తహసీల్దార్ మహేశ్వరరావు శనివారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఈ రెండు గ్రామాలతోపాటు టి.అర్జాపురం, కొత్తకోటలో వాటర్ ప్లాంట్లు నిర్వహిస్తున్నారు. వీటిలో కొన్ని కనీస నిబంధనలు పాటించకుండా వాటర్ ప్యాకెట్లు మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. నీటిలో నలకలు ఉండటంతోపాటు దుర్వాసన వస్తుందని ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని వాటికి లైసెన్స్ రద్దు చేస్తామని జిల్లా అధికారి తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com